క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన



అడ్డాకుల: మూసాపేట మండలం వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–17 ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన కార్తీక్, శ్రీనిధి ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరు క్రీడాకారులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. పెద్దపల్లి జిల్లాలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్, పీడీ నిరంజన్‌రావు, మాజీ ఎంపీటీసీ యాట సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు వాసుయాదవ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తులసీరాం నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్ ఆంజనేయులు, శివకుమార్‌లకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వెంకటయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

‘పదవులు శాశ్వతం కాదు’



రాజాపూర్ (బాలానగర్): రాజకీయ నాయకులకు పదవులు ముఖ్యం కాదని.. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం పెద్దాయపల్లి చౌరస్తాలో నిర్వహించగా.. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అంజయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనను చూసి ప్రజలు ఓటు ఎందుకు వేశామని చర్చించుకుంటున్నారని.. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై ఉండి విజయదుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, శ్రీనివాసరావు, బచ్చిరెడ్డి, సాయిధర్‌గౌడ్, వెంకటాచారి, యాదయ్య, శ్రీశైలంయాదవ్, మల్లేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నల్లా బిల్లులు రద్దు చేయాలని తీర్మానం

భూత్పూర్: మున్సిపాలిటీలో నివాసగృహాల నల్లా బిల్లులు వసూలు చేయరాదని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రజల విజ్ఞప్తి మేరకు నల్లా బిల్లులపై తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శంకర్ నాయక్ ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హన్వాడ: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు రఘురాం గౌడ్ కోరారు. శనివారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీ డీకే అరుణ సూచన మేరకు గ్రామాల్లో ప్రతి గడపకు కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకువెళ్లాలని కోరారు.

■ మండలంలోని కొనగట్టుపల్లికి చెందిన ఇప్పలి రాములు కూతురు ప్రవల్లిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. విద్యార్థినిని ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ విజయేందిర అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి

నవాబుపేట: కుక్కల దాడిలో 10 మేకపిల్లలు మృతి చెందిన ఘటన మండలంలోని లోకిరేవులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. లోకిరేవుకు చెందిన నీరటి వెంకటయ్య తన మేక పిల్లలను పొలంలో ఉంచి, మేకలను మేతకు తీసుకువెళ్లగా.. కుక్కలు దాడిచేసి చంపేశాయి. బాధితుడిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ముడా పరిధిలోకి మిడ్జిల్



మిడ్జిల్ మండల కేంద్రం వ్యూ..

జడ్చర్ల: మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) పరిధిలోకి కొత్తగా మిడ్జిల్ మండలాన్ని చేర్చారు. గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ముడాలో మిడ్జిల్ మండలానికి మినహాయింపు ఇవ్వగా.. ఈసారి కొత్తగా మిడ్జిల్ మండలంలోని అన్ని గ్రామపంచాయతీలను చేర్చారు. మిడ్జిల్, ఖైరంపల్లి, కొత్తపల్లి, చిల్వేరు, వస్పుల, చేదుఘాట్, కంచనపల్లి, దోనూరు, సింగందొడ్డి, మసిగుండ్లపల్లి, వేముల, బోయిన్‌పల్లి, వాడ్యాల్, మున్ననూర్, వెలుగొమ్ముల, కొత్తూరు రెవెన్యూ గ్రామాలను ముడా పరిధిలోకి తీసుకువచ్చారు. కాగా, ముడా పరిధిలోకి మార్చడం వల్ల గ్రామాలకు కొత్తగా ఒరిగేదేమీ లేదని.. సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని పలువురు పేర్కొంటున్నారు.

ప్రయోజనం లేదు..



మిడ్జిల్ మండలంలోని అన్ని జీపీలను ముడా పరిధిలోకి చేర్చడం ఎంత మాత్రం తగదు. ముడాలోకి చేర్చడం వల్ల పన్నుల భారం తప్ప.. మరెటువంటి ప్రయోజనం ఉండదు. ఇళ్ల నిర్మాణం తదితర అనుమతులు రావాలంటే ముడా చుట్టూ తిరగడంతో పాటు అధిక పన్నుల భారం మోయాల్సి వస్తుంది.

– సుదర్శన్, మాజీ ఎంపీపీ, మిడ్జిల్

పట్టుదలతో చదివితేనే లక్ష్యసాధన



పట్టాలు అందుకున్న విద్యార్థులతో పీయూ వీసీ శ్రీనివాస్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు పట్టుదలతో చదివితేనే నిర్దేశిత లక్ష్యం సాధించవచ్చని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరోజినీ రాములమ్మ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో శనివారం 23వ గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో సంపద కోసం కాకుండా, సేవా భావంతో వైద్య వృత్తిని చేపట్టాలని సూచించారు. విద్యార్థులు పది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థానంలో ఉండాలన్నారు. అనంతరం ఫార్మసీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బాలరాజు, డైరెక్టర్ శిరీష, పద్మలత పాల్గొన్నారు.

■ పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌ను జిల్లా సీనియర్ సిటిజన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జగపతిరావు, నాగభూషణం, రాజసింహుడు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని బీఎస్‌ఎన్‌ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బాలాజీ పూర్ణచందర్ అన్నారు. జేపీఎన్‌సీ కళాశాలలో శనివారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. అవాంచిత కాల్స్, ఈమెయిల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎన్‌ఎల్ సిబ్బంది ఫణికుమార్, కోట సుజాత, నర్సింహులు, కళాశాల సిబ్బంది గురురాఘవేందర్, ఆదిత్యసాయి శ్రీనివాస్, కంట్రోలర్ సందీప్‌కుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నెల్లికొండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నెల్లికొండి గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండల మహిళా సమాఖ్య భవనంలో 18 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్ రూ. 500 చొప్పున బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్లయ్య, ఏపీఎం విష్ణుచారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఉమా మహేశ్వర్‌రెడ్డి, వట్టెం శివకుమార్ పాల్గొన్నారు.

తండాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి



మట్టిరోడ్డును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మహమ్మదాబాద్: మారుమూల తండాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డీసీసీబీ మాజీ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని భామ్లానాయక్ తండాకు స్థానిక గిరిజనులు సొంత డబ్బుతో నిర్మించుకున్న మట్టిరోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఉన్న ప్రతి తండాకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తండాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడుతామని అన్నారు. కార్యక్రమంలో జేమ్లానాయక్, రేఖ్యానాయక్, రాజునాయక్, గోబ్రియా, సూర్య పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూస్తాం



డ్రెయినేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మిషన్ భగీరథ పథకంతో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. మున్సిపాలిటీలోని 3, 4, 5వ వార్డుల పరిధిలో విస్తరించిన హౌసింగ్ బోర్డు కాలనీని శనివారం పరిశీలించారు. ఇంకా కొన్ని ప్రాంతాలకు మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు రావడం లేదని స్థానికులు వాపోయారు. అలాగే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని, సీసీ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకులు హన్మంతు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ పోరు



జడ్చర్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జడ్చర్ల, బాలానగర్, మహమ్మదాబాద్, గండేడ్, భూత్పూర్, అడ్డాకుల మండల కేంద్రాల్లో ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. పేద విద్యార్థులు కొందరు చదువుకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

ప్రజాపాలన పేరుతో దోపిడీ

కోయిల్‌కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో దోపిడీ చేస్తుందని బీఎస్పీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ అన్నారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతూ శనివారం స్థానిక తహసీల్దార్ రాజాగణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పోలీసులు, అధికారుల అండతో సూరారం, అంకిళ్ల, కుస్మద్‌పల్లి గ్రామాల వాగుల్లో కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమేష్, హరీష్, హన్మంతు, బాబు, వెంకటయ్య, వీరన్న, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వర్గీకరణతోనే న్యాయం

కోయిల్‌కొండ: వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ నాయకుడు బాలరాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. శ్రీరాములు, ఆంజనేయులు, వెంకటయ్య ఉన్నారు.

పోస్టర్ల విడుదల..

హన్వాడ: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 30న జడ్చర్లలో నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధం మహాసభను విజయవంతం చేయాలని దండోరా మండల అధ్యక్షుడు బి.రాములు కోరారు. శనివారం మండల కేంద్రంలో మహాసభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

మార్కెట్‌లో షెడ్ల నిర్మాణానికి చర్యలు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో కొత్తగా షెడ్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి తెలిపారు. శనివారం మార్కెట్ కార్యాలయంలో పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యాలయం నూతన భవనానికి తీర్మానం చేసి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. అనంతరం మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పత్తి క్రయవిక్రయాలను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఖాజాపాషా, సత్యం, కృష్ణయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



భోజనంలో నాణ్యత తప్పనిసరి

మహమ్మదాబాద్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా లేకపోతే సహించమని ఏటీడీఓ చీన్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాణ్యత లేని భోజనం అందిస్తున్నారన్న విషయం తెలుసుకున్న గిరిజన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం ఆశ్రమ పాఠశాలకు చేరుకొని పరిశీలించిన విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఏటీడీఓ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో భోజన సౌకర్యం, వసతులు తదితర విషయాలను తెలుసుకున్నారు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ పద్మకు సూచించారు. వర్కర్ల కొరత కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని.. ఇకపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని వార్డెన్ తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసిన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలపై చర్యలు తీసుకోవాలని యూఎస్‌పీసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల విద్యాశాఖ అధికారులు పలువురు జీహెచ్‌ఎంలపై చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని.. మిగతా ఎస్జీటీలు, ఎస్‌ఏలపై కూడా చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. పండిట్, పీఈటీల్లో కొందరు అప్‌గ్రేడేషన్ కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేష్, రవికుమార్, మహమూద్, వెంకటేష్, నవీన్ ఉన్నారు.

అదుపుతప్పి డీసీఎంను ఢీకొట్టిన కారు

రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లిలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఓ కారు అదుపుతప్పి డీసీఎంను ఢీకొట్టింది. స్థానికుల వివరాల మేరకు.. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ముదిరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వస్తున్న డీసీఎంను ఢీకొట్టి పల్టీ కొట్టింది. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్యగౌడ్, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన

దేవరకద్ర: మండల కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. రాయచూర్ రోడ్డులో ఉన్న ప్లాట్లకు సంబంధించిన యజమానులు తమ డాక్యుమెంట్లను అధికారులకు చూపించి, ఆన్‌లైన్ నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్, సురేష్ పాల్గొన్నారు.

గ్రీన్ మర్చంట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నవాబుపేట: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శనివారం గ్రీన్ మర్చంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, సిద్దరాంరెడ్డి, కోశాధికారిగా రాఘవేందర్, సభ్యులుగా రవికుమార్, దేవరకొండ శశికుమార్, రాఘవేందర్, యాదయ్య, శంకర్‌లను ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు ప్రేమ్ సుధాకర్ తెలిపారు. అనంతరం వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో అశోక్ కుమార్, నర్సింహులు, శివకుమార్, రమేష్ పాల్గొన్నారు.

‘అనుచిత వ్యాఖ్యలు సరికాదు’



స్టేషన్ మహబూబ్‌నగర్: అల్లా చివరి దూత మహ్మద్ ప్రవక్త (స.అస)పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని.. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ముస్లిం మత పెద్దలు, సంఘాల ప్రతినిధులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రపంచానికే ఆదర్శమూర్తి అయిన మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఈ నెల 29న మహబూబ్‌నగర్ బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు బంద్ ఉంటుందని.. అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఆలిండియా సున్ని ఉల్మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహసిన్‌పాషా ఖాద్రీ, మిల్లీ మహజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్లు తఖీ హుస్సేన్, ఖుద్దూస్ బేగ్, ముస్లిం మతపెద్దలు హాఫిజ్ ఇలియాజ్, అఫ్రోజ్‌షా పాల్గొన్నారు.